# ప్రయివేటు విద్యాసంస్థలు ఫీజులు పేరుతో లూటీ






**సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ**
**ప్రయివేటు విద్యాసంస్థల కు కొమ్ము కాస్తున్న ప్రభుత్వం...**
**సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యా సదస్సు...**

**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :** ప్రగతి నగర్ లోని లీలా సుందరయ్య ఫంక్షన్ హాల్ లో సిపిఎం పార్టీ మేడ్చల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా విద్యా సదస్సు జరిగింది ఈ సదస్సుకు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ సత్యం గారు అధ్యక్షత వహించారు. ముఖ్య ఉపన్యాసకులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ , సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాల నుండి కార్యకర్తలు, ప్రజలు విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. విద్యా వైద్య రంగాలను ప్రతిష్టత కొరకు గత మూడు నెలల నుండి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలలో భాగంగా మేడ్చల్ జిల్లాలో కూడా సర్వే నిర్వహించడం జరిగిందన్నారు . దానిలో విద్యా సంస్థలలో అవకతవకలు కనిపెట్టడం జరిగిందన్నారు . ఈ సదస్సులో కామ్రేడ్ సత్యం మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 15 శాతం మంది ప్రైవేటు పాఠశాలల్లో 85% మంది విద్యార్థులు ఉన్నారు. ఆ సంఖ్య ఉన్నంత విద్యల్లోకి వెళ్ళేటప్పటికి ఐదు శాతం మాత్రమే ప్రభుత్వ కళాశాలలోఉంటున్నారు. ముఖ్య ఉపన్యాసకులు ఆమంచి నాగేశ్వర్ మాట్లాడుతూ.. ఈమధ్య ఢిల్లీలో జరిగిన నీట్ పేపర్ లీకేజీ వల్ల 20 లక్షల మంది రాస్తే ప్రత్యక్షంగా బాధితులు దాదాపు కోటి మంది ఉన్నారు. దీనివల్ల అనేకమంది చనిపోవడం జరిగింది. గత 12 సంవత్సరాల నుండి మీడియా కొంతమంది వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయింది. అయినప్పటికీ సోషల్ మీడియా ఉపయోగించడం బాగా పెరిగిందని అన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ మాట్లాడుతూ.. విద్యా వైద్యం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోనే ఉండాలని మనం అడుగుతుంటే అన్ని ప్రైవేట్ చేస్తామని అంటున్నారు. ప్రస్తుతం 80% విద్యాసంస్థలు ప్రైవేట్ లోనే ఉన్నాయి. జూనియర్ కాలేజీలు 42 ప్రభుత్వంలో ఉంటే 350 ప్రైవేట్ లో ఉన్నాయి. ఇంజనీరింగ్ కాలేజెస్ కూడా మెజారిటీ ప్రైవేట్ లోనే ఉన్నాయన్నారు.దాదాపు 26 వేల కోట్ల రూపాయలు ప్రైవేట్ విద్యాసంస్థలు ఫీజులు పేరుతో లూటీ చేస్తూ ఉన్నాయని ఆరోపించారు. ఈ సదస్సులో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రవి, అశోక్, శ్రీనివాసులు, రాజశేఖర్ మరియు జిల్లా కమిటీ సభ్యులు రాథోడ్ సంతోష్, బి.వెంకట రామయ్య, లింగస్వామి,నరేష్, లక్ష్మణ్,శ్రీనివాస్ సిపిఎం మండల డివిజన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు, అలాగే దాదాపు 400 మంది వరకు విద్యార్థులు, ప్రజలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## భారత్‌లో తొలిసారిగా అగ్రి డాక్టర్ ఉద్యమానికి నాంది

**వ్యవసాయ విద్యార్థులకు వృత్తి అవకాశాలపై దిశానిర్దేశం..**
**ఒకేదికపై 24 మంది రంగ నిపుణులు**
**'ది ఫార్మిస్ట్ సమ్మిట్--2026'లో సుమారు 300 మంది విద్యార్థులకు మార్గదర్శనం**




**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :**వ్యవసాయ విద్యార్థులకు ఆధునిక వృత్తి అవకాశాలను పరిచయం చేయడంతో పాటు, రైతులకు క్షేత్ర స్థాయిలో నాణ్యమైన సాంకేతిక మార్గదర్శనం అందించే నిపుణులను తీర్చిదిద్దే లక్ష్యంతో నవ నిర్మాణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో 'ది ఫార్మిస్ట్ సమ్మిట్--2026'ను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సదస్సు ద్వారా భారతదేశంలోనే తొలిసారిగా 'అగ్రి డాక్టర్ ఉద్యమం'కు నాంది పలికినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా న్యాయవాది, వెన్నెల ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర నరేష్ హాజరై మాట్లాడారు. తాను రైతు బిడ్డగా, రైతుల కష్టాలను ప్రత్యక్షంగా తెలిసిన వ్యక్తిగా ఈ వేదికకు వచ్చానని తెలిపారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సహా ఆధునిక సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో రైతులు కూడా సాంప్రదాయ పద్ధతులకే పరిమితం కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని వ్యవసాయంలో ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. గతంలో ఎండ్రిన్ వంటి ప్రమాదకరమైన పురుగు మందుల వినియోగంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పరిస్థితులు పునరావృతం కాకూడదని ఆయన అన్నారు. రైతులకు సరైన సమయంలో సరైన సలహాలు అందించేందుకు శాస్త్రీయ పరిజ్ఞానం కలిగిన వ్యవసాయ నిపుణుల అవసరం ఎంతో ఉందన్నారు. ఇంటర్నెట్‌లో 'రైతు' అని వెతికితే బక్కచిక్కిన రైతు ఆకాశం వైపు చూస్తున్న దృశ్యమే కనిపించే పరిస్థితి మారాలని, రైతు అంటే సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి సాధిస్తున్న ఆధునిక వ్యవసాయదారుడిగా ప్రపంచానికి కనిపించేలా చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువత వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ కోర్సుల వైపు మరింతగా ఆకర్షితులు కావాలని సుంకర నరేష్ పిలుపు నిచ్చారు. వ్యవసాయ విద్యను కేవలం ఉద్యోగానికి పరిమితం చేయకుండా, రైతులకు సేవ చేయడంతో పాటు స్వయం ఉపాధి, అగ్రి బిజినెస్, సాంకేతిక వ్యవసాయం వంటి విస్తృత అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. సదస్సులో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు చెందిన 24 మంది శాస్త్రవేత్తలు, నిపుణులు, పారిశ్రామికవేత్తలు, అభ్యుదయ రైతులు, అగ్రి బిజినెస్ ప్రతినిధులు, వృత్తి మార్గదర్శకులు పాల్గొన్నారు. వీరు వ్యవసాయ విద్యార్థులు, యువ వ్యవసాయ నిపుణులకు ఆధునిక వ్యవసాయ సాంకేతికత, అగ్రి బిజినెస్, ఉపాధి అవకాశాలు, రైతులకు క్షేత్రస్థాయి సలహాలు అందించే విధానాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సుమారు 300 మంది వ్యవసాయ విద్యార్థులు, యువ వ్యవసాయ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొని నిపుణుల సూచనలు, మార్గదర్శకాలను పొందారు. వ్యవసాయ రంగంలో విద్యావంతులైన యువతకు కొత్త అవకాశాలను పరిచయం చేయడంతో పాటు, రైతు సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు చూపగల 'అగ్రి డాక్టర్ల'ను తయారు చేయడమే ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. రైతు--వ్యవసాయ నిపుణుల మధ్య సాంకేతిక వారధిని బలోపేతం చేయడం ద్వారా వ్యవసాయ రంగంలో సానుకూల మార్పులు తీసుకురావచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నవ నిర్మాణ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు రాంబాబు పొన్నాన, ఉపాధ్యక్షురాలు అడ్వకేట్ సాయి జ్యోతి యు. జగదీశ్వరరావు పొన్నానతో పాటు సంస్థ సభ్యులు సమన్వయంతో నిర్వహించారు. వ్యవసాయ విద్యార్థులు, యువ నిపుణులకు వృత్తిపరమైన దిశానిర్దేశం అందించిన ఈ సదస్సు వ్యవసాయ రంగంలో కొత్త ఆలోచనలకు వేదికగా నిలిచింది.

## పదో వార్డులో ఘనంగా 'వన మహోత్సవం'

**పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం కౌన్సిలర్ నల్ల మధుయాదవ్**



**మన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ ఆగష్టు30** పరిసరాల పరిశుభ్రతతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడమే లక్ష్యంగా మోత్కూర్ మున్సిపాలిటీలోని 10వ వార్డులో 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని ఆదివారం అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు ప్రజలకు ఉచితంగా మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన 10వ వార్డు కౌన్సిలర్ నల్ల మధుయాదవ్ స్వయంగా స్థానిక ప్రజలకు మొక్కలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని, ప్రతి ఇంటి ముందు కనీసం రెండు మొక్కలైనా పెంచాలని కోరారు. వార్డును హరిత వార్డుగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌తో పాటు నాయకులు వర రాములు యాదవ్, జటంగి పరుశరాములు, అనంతరెడ్డి, మహేష్, మల్లయ్య, రాములు, అశోక్, వార్డ్ ఆఫీసర్ మహేష్, మున్సిపల్ సిబ్బంది మరియు వార్డు ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అదుపుతప్పి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టిన వ్యాన్



**మన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ ఆగష్టు30-2026** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని భువనగిరి రోడ్డు బాలుర బీసీ హాస్టల్ సమీపంలో ఆదివారం ఉదయం ఒక మినీ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బలమైన వేగంతో ఢీకొట్టి పల్టీ కొట్టింది.ప్రస్తుతం భువనగిరి రహదారి పనుల్లో భాగంగా మట్టి పనులు జరుగుతుండటంతో రోడ్డు ఒరిగిపోయి ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ఘటనలో ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా ధ్వంసం కాగా, తీవ్రంగా గాయపడిన డ్రైవర్ను స్థానికులు 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రహదారి పనుల వద్ద ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కాంట్రాక్టర్లు తగిన రక్షణ చర్యలుచేపట్టాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సామాజికవేత్త ప్లెక్సీ వీఎస్ఎన్ మూర్తికి ఘన సన్మానం

**సమాజ సేవలోనే నిజమైన తృప్తి ఉంది: వీఎస్ఎన్ మూర్తి**
**ఆదినారాయణ రెడ్డి సేవలు అభినందనీయం: పలువురు నేతల ప్రశంస**



**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :** ?కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన ప్రముఖ సామాజికవేత్త 'ప్లెక్సీ' వీఎస్ఎన్ మూర్తి పుట్టినరోజు వేడుకలను ఆయనను స్థానిక నాయకులు, అభిమానులు అత్యంత వైభవంగా సన్మానించారు. కుత్బుల్లాపూర్ టెంట్ హౌస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఆవుల ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని మూర్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సత్కరించారు ?ఈ సందర్భంగా వీఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ... తన పుట్టినరోజున ఇటువంటి ఆత్మీయ సన్మానం ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. సమాజ సేవలోనే తనకు నిజమైన తృప్తి లభిస్తుందని, రాబోయే రోజుల్లో పేద ప్రజలకు, స్థానిక సమస్యల పరిష్కారానికి మరింత విస్తృతంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడతానని స్పష్టం చేశారు. తన వంతుగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని పేర్కొన్నారు. ?అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వక్తలు మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ టెంట్ హౌస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు ఆవుల ఆదినారాయణ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. ఆదినారాయణ రెడ్డి కేవలం తన వ్యాపార రంగానికే పరిమితం కాకుండా, ఒక నమ్రత కలిగిన వ్యాపారవేత్తగా, సామాజిక కార్యకర్తగా సమాజానికి విశేష సేవలందిస్తున్నారని కొనియాడారు. కష్టాల్లో ఉన్నవారిని ఆదుకోవడంలో ఆయన ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. ?ఈ వేడుకల్లో కుత్బుల్లాపూర్ టెంట్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ట్రెజరర్ మల్లారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మహేందర్, జనరల్ సెక్రటరీ శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చిన్నలతో పాటు సభ్యులు గణేష్, మధు, నగేష్, నాగరాజు తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ?భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి..

**కలెక్టర్, ఎమ్మెల్యే సమీక్ష**





**మన తొలివెలుగు, ?ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో :** జిల్లాలోని పురోగతిలో ఉన్న వివిధ సాగునీటి ప్రాజెక్టుల భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. ఆదివారం గద్వాల జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు కుంట రిజర్వాయర్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణపై సంబంధిత అధికారులతో వారు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భూసేకరణ ప్రక్రియను సత్వరమే పూర్తి చేసి, అవార్డు పూర్తయిన రైతుల ఖాతాల్లో వెంటనే పరిహారం డబ్బులు జమ చేయాలని స్పష్టం చేశారు. సాగునీటి విడుదల విషయంలో స్పష్టమైన ప్రణాళికతో ముందుకెళ్లాలని, అధికారులు నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. వివిధ మండలాల పరిధిలో ఇంకా సేకరించాల్సిన భూములపై ఆయా శాఖల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలపై దగ్గరిలోని ప్రజలు తిరగబడే రోజు

**తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్**



**మన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ :**రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, పాలనా వైఫల్యాలపై ప్రజలు తిరగబడే రోజు దగ్గర్లోనే ఉందని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మోత్కూర్ మండలం దాచారం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కలిసి రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ భూములను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. 22-ఏ పేరుతో కోటి 16 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చి పేదల నుంచి అడ్డగోలుగా లంచాలు గుంజుతున్నారని మండిపడ్డారు. అలాగే జీవో 97 తీసుకొచ్చి పాలిటెక్నిక్ విద్యను, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేశారని విమర్శించారు. సాగర్, శ్రీశైలం నుంచి కృష్ణా నీటిని ఏపీ ప్రభుత్వం దౌర్జన్యంగా తరలిస్తుంటే జిల్లా మంత్రులు నోరు మెదపకపోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా సెప్టెంబర్ 2న తుంగతుర్తిలో భారీ నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు, అలాగే సెప్టెంబర్ 3న మిర్యాలగూడలో కేటీఆర్ పాల్గొనే వ్యవసాయ విధ్వంస నిరసన సభకు రైతులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నేవూరి ధర్మేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, మాజీ ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ శాఖ అధ్యక్షులు మరియు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## 22-ఏ జాబితా నుంచి రైతుల భూములను తొలగించాలి



**మన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ ఆగష్టు30-2026** మండలంలోని అర్హులైన రైతుల భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి వెంటనే విముక్తి చేయాలని బీజేపీ మోత్కూర్ మండల అధ్యక్షుడు గుదే మధుసూదన్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పనకబండ గ్రామంలో రైతులతో కలిసి వారి భూసమస్యలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏళ్ల తరబడి హక్కు పత్రాలతో వ్యవసాయం చేసుకుంటున్న భూములను 22-ఏ జాబితాలో చేర్చడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అత్యవసర సమయాల్లో భూములను అమ్ముకోలేక, తాకట్టు పెట్టలేక కుటుంబ అవసరాలు తీర్చుకోలేకపోతున్నారని నిలదీశారు. రెవెన్యూ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి, 22-ఏ నుంచి అర్హులైన భూములను తొలగించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. నిర్లక్ష్యం వహిస్తే రైతుల పక్షాన బీజేపీ పెద్ద ఎత్తున ఉద్యమిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ఇన్‌ఛార్జ్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు రాధారపు మల్లేశం, గుంటి సతీష్, మార్గం సుజాత, హరికృష్ణ, నాయకులు ఐలమ్మ, రాజమల్లు, ఆండాలు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కొలువులకు నోటిఫికేషన్..

**జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ**

**మహిళా అభ్యర్థులకు ఉద్యోగ అవకాశం**



**మన తొలి వెలుగు ఇబ్రహీంపట్నం ప్రతినిధి** సిహెచ్ రాజు : రంగారెడ్డి జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో జిల్లాలో ఖాళీగా ఉన్న 125 అంగన్వాడీ టీచర్ పోస్టుల భర్తీకి మహిళా అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి శాంతి శ్రీ తెలిపారు.జిల్లాలో ఆమనగల్‌లో 31, చేవెళ్లలో 29, హయత్‌నగర్‌లో 3, ఇబ్రహీంపట్నంలో 21, మహేశ్వం

## జెన్ జి ఉద్యమంలో మనం కూడా భాగస్వాములు కావాలి.

**సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్.**




**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :** అఖిల భారత యువజన సమాఖ్య కుత్బుల్లాపూర్ మండల మహాసభ నేడు మఖ్దుం నగర్ సిపిఐ కార్యాలయంలో ఏ ఐ వై ఎఫ్ కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ మహాసభలకు ముఖ్యతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,ఏ ఐ వై ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సల్మాన్, సత్యప్రసాద్ లు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు,ప్రతి ఒక్కరికి 15 లక్షల రూపాయలు, ఏమయ్యాయన్నారు.అవినీతికి వ్యతిరేకంగా లోక్పాల్ బిల్లు వంటి వాగ్దానాలు చేసి ఎన్నికలలో గెలిచి ఎలాంటి హామీలను నిలబెట్టకుండా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం లేదా అని ఆరోపించారు. తన అనుచరులైన అదానీ అంబానీకి అమ్మడం చేసి లక్షలాది మంది పొట్టగొట్టిన చరిత్ర కేవలం బీజేపీకే ఉంటుందని అన్నారు.పరీక్షల లీక్ పై ఉద్యమం చేస్తే బీజేపీ ఆర్ ఎస్ ఎస్ బత్తాయిలు వాళ్లను నక్సలైట్లని,కమ్యూనిస్టులని,దేశ ద్రోహులని ప్రచారం చెయ్యడం సిగ్గుమాలిన పనని అన్నారు.చివరికి వాళ్లే ప్రజలకు క్షమాపణ కోరారని అన్నారు.నీట్ ఉద్యమం ఒక గుణపాఠమని కావున ఉద్యమం చేస్తే ఏదైనా సాధ్యమని దానికి నాయకత్వం నేటి యువతనే వహించిందని అన్నారు.అలంటి యువతను ఆదర్శం గా తీసుకోని ఇక్కడి యువత రాజకీయాల్లోకి వచ్చి అవినీతి కబ్జాకోరుల చేతిల నుండి మన సమాజాన్ని రక్షించి మంచి నాయకులుగా,ప్రజాప్రతినిధులుగా ఎదగాలని కోరారు.ఈ సందర్భంగా సిపిఐ మండల కార్యదర్శి స్వామి మాట్లాడుతూ యువత నిర్వహించే అన్ని ఉద్యమాలకు సిపిఐ మద్దతు ఉంటుందని అన్నారు. సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్ష కార్యదర్శులుగా ప్రవీణ్ కీర్తి కోశాధికారిగా వి సురేష్ లతోపాటు తొమ్మిది మంది ని ఆఫీస్ బేరాలుగా తీసుకోవడం జరిగింది.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :** ఐడిపిఎల్ చౌరస్తా వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గౌడ కులస్తులకే పరిమితమైన నాయకుడు కాదని, సబ్బండ వర్గాల అభ్యున్నతి కోసం, అణగారిన వర్గాలకు సామాజిక న్యాయం అందించేందుకు పోరాడిన గొప్ప మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.అనంతరం విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు, స్థానిక కమిటీ సభ్యులను ఆయన అభినందించారు.ఈ కార్యక్రమంలో సర్దార్ పాపన్న గౌడ్ కమిటీ చైర్మన్ నందనం దివాకర్ అధ్యక్షులు గంగా శ్రీనివాస్ గౌడ్ , మాజీ కార్పొరేటర్ విజయ శేఖర్ గౌడ్ , ఆనంద్ గౌడ్ , ప్రభా గౌడ్ , జయ , టీ నర్సింగరావు గౌడ్, బుర్ర మణికంఠ గౌడ్, మీ శ్యామనారాయణ గౌడ్, ప్రభు, సంతోష్, సురేష్ గౌడ్, భూషణం గౌడ్, సంజు గౌడ్, రాజు గౌడ్, లక్ష్మణ్ గౌడ్, అనిల్, శివ గౌడ కుల పెద్దలు, స్థానిక నాయకులు, పలువురు ప్రముఖులు, కమిటీ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్‌కు ఘన నివాళులు అర్పించారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



**మన తొలి వెలుగు , మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (30 ఆగస్టు 2026)** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ సుధాకర్ తెలుగు వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ లోని బురాన్ ఖాన్ చెరువులో 30 నుంచి 40 ఏళ్ల మధ్యలో ఉండే ముస్లిం వ్యక్తి చెరువులో తేలియాడుతూ స్థానికులకు కనిపించడంతో పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇచ్చారన్నారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించి భద్రపరచడం జరిగిందన్నారు. లైట్ గ్రీన్ కలర్ ఫుల్ హ్యాండ్ షర్ట్, కాకి కలర్ పాయింట్ ధరించడం జరిగింది. ఎవరైనా బంధువులు, తెలిసినవారు గుర్తు పట్టితే బాలాపూర్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని తెలిపారు.

## దుర్గమ్మ దయ భక్తులందరిపై సంపూర్ణంగా ఉండాలి

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని 132 – జీడిమెట్ల డివిజన్ వినాయక్ నగర్ లో నూతనంగా నిర్మించిన దేవాలయంలో దుర్గా భవాని అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన, బొడ్రాయి ప్రతిష్టాపన కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ పాల్గొని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో వినాయక నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నదీమ్ రాయ్, ఆలయ కమిటీ సభ్యులు ఉ కాలనీవాసులు నర్సింగ్ రావు, మురళీ, జీ.యాదగిరి, పాండు, సుధా, వెంకటేష్, హరి బాబు, వి.శ్రీనివాస్, మానయ్య, అనంతయ్య, శ్రీనివాస్,కరీం, అతర్ భాస్కర్, బంధప్ప, సువర్ణ, రీతూ, రాణి, షీలా, నిర్మలా, శకుంతల, సీనియర్ నాయకులు సంపత్ మాధవరెడ్డి, కుంటా సిద్ధిరాములు, కాలే నాగేష్, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, సమ్మయ్య నేత, కాలే గణేష్, ఇస్మాయిల్, కుంటి మల్లేష్, బాల మల్లేష్, బాబీ, చంద్రశేఖర్ రెడ్డి, కుంట వేణు, డీజే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాఘవేంద్ర కాలనీలో మురుగు నీటి సమస్యల పరిశీలన



**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ (కుత్బుల్లాపూర్ డివిజన్) పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి పర్యటించారు. కాలనీ లో మురుగు నీరు మరియు వర్షపు నీటి నిల్వ సమస్యలపై కాలనీ వాసులతో కలిసి పర్యటించి, సమస్యలను అడిగి తెలుసుకొని, వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు .ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు బి.వి. నారాయణ, బి. సతీష్, ఎం. శ్రీనివాస్, సతీష్ చక్రవర్తి, సోలార్ శ్రీనివాస్, కే. ఉపేంద్ర, ఆర్. చంద్రమౌళి, సాయిలు, మల్లేష్ గౌడ్, రాములు గౌడ్, మహీందర్ రెడ్డి, రామానుజం, బాలరాజు, రంగారావు, బప్పన్న, కొమరయ్య, నిఖిల్, చందు, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చి రైతులకు, సామాన్యులకు అన్యాయం.

**రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు.**

**మేడ్చల్(అర్బన్) జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన గిరివర్ధన్ రెడ్డి.**

**బీజేపీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించిన రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు.**



**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం లోని షాపూర్ నగర్ లో బీజేపీ జిల్లా కార్యాలయాన్ని రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు రామచందర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత భారాస ప్రభుత్వం 15 శాతం పర్సెంటీజీతో దోపిడీ చేస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం 30 శాతం కమిషన్ తో ప్రజలను నిలువు దోపిడీ చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకురాబోతున్న జఖ=జు చట్టం ప్రజలకు శాపంగా మారబోతోందని, ఇప్పటికే ప్రైవేట్ భూములను నిషేధిత జాబితాలో చేర్చి రైతులకు, సామాన్యులకు తీరని అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. ఈ కార్యాలయం ద్వారా ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూ ప్రజలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

**ప్రతి పేదవాడికి, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ పోరాటం... ఈటెల రాజేందర్...**

ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రతి పేదవాడికి, పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ, నిరంతరం ప్రజలతో మమేకమై వచ్చే ప్రతి ఎన్నికలోనూ పార్టీని గెలిపించేలా కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు గిరివర్ధన్ రెడ్డికి సూచించారు. దేశంలోనే అతి పెద్దదైన మల్కాజిగిరి పార్లమెంట్ కు ప్రాతినిధ్యం వహిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజాసేవలో నా జీవితాన్ని గడుపుతానని పేర్కొన్నారు. అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన గిరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుండి పొలం పనులు చేసుకుంటూ, కాలేజీ రోజుల్లో ఏబీవీపీలో పని చేస్తూ, తెలంగాణ కోసం ఈటల తో కలిసి కొట్లాడిన తన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్ రావు నాయకత్వంలో, ఎంపీ ఈటల రాజేందర్ మార్గదర్శకత్వంలోశక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుంటానని, ప్రతి కార్యకర్త సగర్వంగా తలెత్తుకొని నిలబడేలా జిల్లా పార్టీని అభివృద్ధి చేస్తానని ప్రకటించారు. తనకీ అవకాశమిచ్చిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.అంతకు ముందు జిల్లా మాజీ అధ్యక్షుడు డా॥ ఎస్ మల్లారెడ్డి, గిరివర్ధన్ రెడ్డి కి లాంఛనంగా బాధ్యతలు అప్పగించారు.ఈ సందర్భంగా వివిధ కుల సంఘాల నాయకులు సాంప్రదాయ రీతిలో గిరివర్ధన్ రెడ్డి ని సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, మూగ జయశ్రీ, కొల్లి మాధవి, రాష్ట్ర ఎస్టీ మోచ అధ్యక్షులు రవి నాయక్ , ఎస్సీ మోర్చా జనరల్ సెక్రెటరీ దాసి నాగరాజు. రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి , రాష్ట్ర అధికార ప్రతినిధులు సుధాకర్ శ్రీనివాస్ , ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ జిల్లా ఓబీసీ అధ్యక్షులు శేఖర్ యాదవ్ మాజీ కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు రాజ్యలక్ష్మి మహేందర్ , శ్రవణ్ జిల్లా ఇన్చార్జ్ మహేంద్ర, జిల్లా మాజీ అధ్యక్షులు మాధవరం కాంతారావు సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజుగారు ప్రీతం రెడ్డి మరియు జిల్లా నలుమూలల నుంచి డివిజన్ అధ్యక్షులు శక్తి కేంద్ర అధ్యక్షులు భూత్ అధ్యక్షులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## సాగునీటి పెండింగ్ ప్రాజెక్ట్ లను కాల్వలను వెంటనే పూర్తి చెయ్యాలి

**-గుండు వెంకటనర్సు**

**సిపిఎం మండల కార్యదర్శి**



**మన తొలివెలుగు మోత్కూర్ ప్రతినిధి పబ్బు ప్రవీణ్ ఆగష్టు30-2026** జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్ట్ లు,కాల్వలకు నిధులు కేటాయించి త్వరితగతిన పూర్తిచేసి రైతులకు సాగునీరు అందించాలని, సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్రతో నైన ప్రభుత్వం కళ్ళు తెరవాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. ఆదివారం రోజున మోత్కూర్ లోని పార్టీ కార్యాలయంలో ఆయన పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ..జిల్లా ఏర్పాడి పది సంవత్సరాలు గడచిన జిల్లాలోని ప్రాజెక్ట్ లు, కాల్వలు పెండింగ్ లోనే ఉన్నాయని బస్వపురం, గందమల్ల, చర్లగూడెం ప్రాజెక్ట్ లు, మరియు బునాదిగాని కాల్వ, ధర్మారెడ్డి, పీలాయిపల్లి కాల్వలు ఇప్పటికి పూర్తి కాలేదని అన్నారు. ఆత్మకూర్(యం) మోత్కూర్, అడ్డగూడూర్ మండలాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో 2006 లో ప్రారంభమైన బునాదిగాని కాల్వ నేటికీ పూర్తి కాలేదని అన్నారు. కలుషిత మూసి నీటి వల్ల ప్రజలు క్యాన్సర్ చర్మ వ్యాదులు లాంటి రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలోని రైతులు సాగునీటి సమస్యలను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం స్పందించి సాగునీటి ప్రాజెక్టు లకు నిధులు కేటాయించి ప్రాజెక్టు లతో పాటు, కాల్వలను కూడ పూర్తి చేసి రైతులకు సాగునీరు

## సామాజిక కార్యక్రమాలకు వేదికలు కమ్యూనిటీ హాళ్లు

**బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్ మన తొలివెలుగు ప్రతినిధి టి రమేష్ :** సూరారం డివిజన్ లక్ష్మీ నగర్ లో నూతనంగా నిర్మించనున్న లక్ష్మీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన భవన నిర్మాణ పనులకు బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూఐక్యతకు, సామాజిక కార్యక్రమాల నిర్వాహణకు చక్కటి వేదికలు కమ్యూనిటీ హాళ్లు అని అన్నారు. కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను కమిటీ సభ్యులు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మంత్రి సత్యనారాయణ, సురేష్ రెడ్డి, లక్ష్మీ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు అమృత రెడ్డి, ప్రధాన కార్యదర్శి శంకర్ రావు, నాయకులు ఇంద్రసేన గుప్తా, యాదిరెడ్డి, రాఘవ రెడ్డి, సురేష్, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి, వారాల వినోద్, కోల శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## సిరి వేరు మధుని పరమశించిన సుజాలదాత పైల శేఖర్ రెడ్డి



**మన తొలి వెలుగు, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి జంగిటిరవీందర్ (30 ఆగస్టు2026)** భువనగిరి నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత పైళ్ల శేఖర్ రెడ్డి బి ఆర్ ఎస్ మండలం నాయకులు సిలివేరు మధు గత కొన్ని రోజులుగా హెల్త్ పరంగా ప్రాబ్లం ఉన్నందునఈరోజు వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించడం జరిగింది.. కార్యక్రమం లో బిఆర్ఎస్ భువనగిరి మండల పార్టీ అధ్యక్షుడు తుక్కాపురం సర్పంచ్ జనగాం పాండు, భువనగిరి మండల సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు జక్క రాఘవేందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేశపట్నం రమేష్, చందుపట్ల మాజీ సింగిల్ విండో చైర్మన్ బాల్గురి మధుసూదన్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి సుబ్బురు బీరు మల్లయ్య, మొగుళ్ల శ్రీనివాస్. తదితరులు పాల్గొన్నారు

## 57 డివిజన్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తా



**మన తొలివెలుగు, మహేశ్వరం ప్రతినిధి ముత్తయ్య (30 ఆగస్ట్ 2026)** 57 డివిజన్ పరిధిలోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నవారు మల్లా రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలోని అల్మాస్ గూడ గ్రామ పరిధి విశాఖ నగర్ ఫేస్ 3 కాలనీ లో ఆదివారం ఆయన కాలనీ వాసుల తో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను తెలిపారు. ఈ సందర్భంగా నవారు మల్లారెడ్డి మాట్లాడుతూ కాలనీ పరిధిలో 30 శాతం వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కాలేదని, అంతర్గత రోడ్లు పూర్తి స్థాయిలో లేవని, స్ట్రీట్ లైట్స్ కూడా పూర్తిగా లేక రాత్రి పూట ఇబ్బందులు పడుతున్నామని కాలనీ ఇబ్బందులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. తప్పకుండా విశాఖ నగర్ ఫేస్ 3 కాలనీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని, మహేశ్వరం నియోజక వర్గం ఇంచార్జ్ కిచ్చన్నగారి లక్ష్మా రెడ్డి గారి తో మాట్లాడి అభివృద్ధికి సంబంధించి తగిన నిధులు మంజూరు చేయించి డ్రైనేజీ నిర్మాణం, అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం చేయిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవి, మాజీ అధ్యక్షులు రమేష్ గౌడ్,రవీందర్, ప్రభాకర్ రావు,వి రామ్ రెడ్డి, శ్రీధర్,రాము,రాజు,సత్యం,అభిజిత్ తదితర కాలనీ వాసులు ఉన్నారు.

